


# బకెట్ లిస్ట్ అనురాధ

**పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం**
**కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

సునంద మనవరాలి గదిలోకి వచ్చింది. ఖాళీ టైం లో ఆమె గది సర్దడం ఆమెకు ఇష్టం.

"ఎందుకమ్మమ్మా నేను సర్దుకుంటాను కదా! అప్పుడప్పుడు టైం దొరకక అలా వదిలేస్తూ ఉంటాను. నువ్వు పట్టించుకోకు. నీ అంత పర్ ఫెక్ట్ గా నేను ఉండ లేను. అమ్మ కూడా చెప్పి చెప్పి విసిగి పోయింది. ఐనా నీకొక విషయం చెప్పనా? Intelligent people అంటే తెలివైన వాళ్ళు తమ పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోరట" అంది కిరణ్.

నవ్వుతూ " అలా అని ఎక్కడైనా రాసారా?" అంది సునంద.

నవ్వుతూ అవిడ్ని ఒక్కసారి కౌగలించుకుని వెళ్ళిపోయింది కిరణ్మయి.

పుస్తకాలు బొత్తిగా పెడదామని తీసిన సునందకు కిరణ్ రాస్తున్న నోట్ బుక్ కనబడింది. ఏమిటో అని చూడబోయిన ఆమెకు బకెట్ లిస్ట్ అని కనబడింది. దానికింద కిరణ్ తను చేరుకోవాల్సిన లక్ష్యాల గురించి రాసుకుంది. అలా ఎందుకు రాసుకుందో అర్థం కాలేదు. అసలు ఆమాటే కొత్తగా అనిపించింది సునందకు.

సరే మనవరాలు వచ్చాక అడుగుదామని అనుకుంది. నీట్ గా సర్ది తలుపు దగ్గరగా వేసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

సునంద దంపతులకు ఒక కొడుకు కూతురు. కొడుకు అమెరికాలోనూ, కూతురు బెంగుళురు లోను ఉంటున్నారు. వాళ్ళ వీలుని బట్టి కొడుకు దగ్గరకు, కూతురు దగ్గరకు వెడుతూ ఉంటారు. భర్త రిటైర్ మెంట్ తరువాత పల్లెలో సొంత ఊళ్ళో ఉండడానికి నిర్ణయించుకున్నారు.

"అక్కడెందుకు నా దగ్గర ఉండవచ్చు కదా! పల్లెలో ఎవరున్నారని? మీకేమైనా అవుతే చూసుకుందుకు ఎవరున్నారని" అంది కూతురు.

ఎప్పుడూ ఉద్యోగం హడావుడిలో ఉండే కూతురు తమ అవసరాలు చూస్తుందన్న నమ్మకం లేదు. ఐనా ప్రశాంతంగా ఊళ్ళో కల్మషం లేని వాతావరణంలో స్వేచ్ఛగా ఉండడంలో ఒక ఆనందం ఉంది. ఇష్టమున్నది వండుకోవడం లేకపోతే పాలు పళ్ళుతో కాలక్షేపం చెయ్యడం. ఇక్కడ అలా కాదు వాళ్ళ కోసం రోజూ వంట వండడం తప్పదు.

కన్న పిల్లలకు వంట వండడం కూడా తప్పేనా? అంటే సమాధానం ఇవ్వడం కష్టం. కనీసం బాధ్యతలు తీరాక తమ కోసం తాము బతకాలి. అదేమిటో చాలా మంది ఆడపిల్లలకు ' మంగలాడ్ని చూస్తే ఎద్దు కాలు కుంటింది అన్నట్లు' తల్లి ని చూడగానే తమ బాధ్యతలన్నీ ఆమె మీదకు తోసేసి కూర్చుంటారు. మళ్ళీ చాకిరీకే కానీ సలహాలకు పనికి రారు. కూతుళ్ళే ఇలా ఉంటే కోడళ్ళనించీ ఇంకేమి ఆశిస్తారు? పెద్ద వాళ్ళు

ఐనా ఇవ్వన్నీ పట్టించుకోకుండా మనవల కోసం అప్పుడప్పుడు వస్తూ ఉంటారు.

గదిలోకి వచ్చిన సునందను చూసి భర్త అడిగాడు "పనులన్నీ పూర్తి చేసి వచ్చావా? కాస్త మోకాలు నొప్పిగా ఉంది. కాస్త ఆయింట్ మెంట్ రాయవోయ్" అన్నాడు రమణ

చదువుతున్న నవల పూర్తి చెయ్యాలని ఉన్నా, భర్త అడిగినది చెయ్యడం ముఖ్యం. ఎంతో నొప్పి ఉంటే కానీ అతను అడగడు. ఆమెకు నొప్పి వచ్చినా అతను ఆమెకు సేవ చెయ్యడానికి వెనుకాడడు.

మంచం మీద అతని పక్కన కూర్చుని మోకాలికి ఆయింట్ మెంట్ రాయడం మొదలు పెట్టింది. పని చేస్తున్నా ఆలోచనల్లో మునిగి పోయిన భార్యను, "ఏమయ్యింది ఏదో ఆలోచనలో ఉన్నావు? " అన్నాడు రమణ

" ఏం లేదు" అంది.

చెప్పడానికి ఇష్టం లేదని అర్ధమయ్యింది. బలవంతం చెయ్యలేదు. ప్రతీసారీ తన మనసులో ఉన్నవన్నీ చెప్పాలని లేదు. ఇష్టం ఉన్నప్పుడు ఆమే చెపుతుంది అనుకున్నాడు. మందు రాస్తున్న ఆమె చెయ్యి మీద తన చెయ్యి వేసి " నీ చేతుల్లో ఏదో మంత్రం ఉందోయ్. ఎంత నొప్పి ఐనా వెంటనే తగ్గిపోతుంది" అన్నాడు రమణ

"చాల్లెండి సరసాలు" అంది నవ్వుతూ

"నేను ఉన్నమాట అంటే సరసాలు అంటావేమిటి? ఐనా కట్టుకున్న పెళ్ళాంతో కాక పరాయి వాళ్ళతో ఆడతానా? అన్నాడు నవ్వుతూ.

" సర్లెండి పడుకోండి" అంటూ మంచం మీద నించి లేచింది.

కుర్చీలో కూర్చుని నవల చదవడానికి ఉపక్రమించింది. భర్త అడిగిన దానికి సమాధానం చెప్పలేదు. తన మనసులోని భావాలు అన్నీ అతనితో చెప్పాలనిపించదు. అతను వద్దంటే చెయ్యలేదు అదొక బలహీనత ఆమెకు.

సాయంకాలం దాకా కిరణ్ తో మాట్లాడడానికి అవకాశం రాలేదు. కాలేజ్ నించి అలిసిపోయి వచ్చింది..

సాయంకాలం కోసం వంట చెయ్యడానికి వంటింట్లోకి వెళ్ళింది. వెనక వీపు మీంచి గుండెల మీదకు జారిన చేతుల్ని గుర్తించింది. వెను తిరిగి చూసింది.

"థాంక్యూ అమ్మమ్మా. నా గది సర్దినందుకు ఐనా నేను సర్దుకుంటాను కదా!" అంది.

"ఫరవాలేదు అది నాకు ఆనందాన్ని ఇస్తుంది." అంది.

" ఇక్కడి కొచ్చాక నీకు రెస్ట్ దొరకదు. మీ ఇంట్లోనూ, ఇక్కడా నువ్వే పని చేస్తావు. ఆ పైన నా పనులు కూడా ఎందుకు నీకు?" అంది కిరణ్.

" నాకు ఇష్టం అన్నాను కదా!"

" పోనీ ఇవ్వాళ వంట నేను చెయ్యనా?" అంది.

"వద్దు నేనే చేస్తాను. నీతో కొంచెం మాట్లాడాలి. అలా కూర్చో" అంది సునంద.

" అంత సీరియస్ మేటరా?"

"కాదురా కుతూహలం. ఇందాకా నీ గది సర్దుతుంటే ఒక నోట్ బుక్ లో బకెట్ లిస్ట్ (bucket list) అని చూసాను. అంటే ఏమిటి? అని తెలుసుకోవాలని ఉంది" అంది సునంద

"ఓస్ అదా! బకెట్ లిస్ట్ అంటే మనిషి తన జీవితంలో సాధించాలని అనుకుంటున్న లక్ష్యాలు, మనం జీవితంలో ఇప్పటిదాకా సాధించినవి, సాధించాలనుకున్నవీ అన్నమాట. ప్రతీ మనిషీ తన జీవిత కాలంలో ఏం సాధించాలి? ఇప్పటిదకా ఏం సాధించాడు అనేవే ఈ బకెట్ లిస్ట్. మా ఫ్రెండ్స్ అందరం రాసుకుంటాము. అలాగే నేను కూడా నా లిస్ట్ రాసుకున్నాను" అంది కిరణ్.

"ఏమిటో మాకు ఇవన్నీ తెలియవు రా ఏదో బతికేసాము. చదువు మాత్రం చదువుకున్నాను. అది కూడా అమ్మా నాన్నా చెప్పారని. ఆ తరువాత పెళ్ళి, పిల్లలు. మీ అమ్మ నోటంబడ కూడా ఈ మాట ఎప్పుడు వినలేదు. ఇది కొత్తగా వచ్చిందా?"

"లేదు అమ్మమ్మా పాతదే దీన్ని ఎంత మంది ఫాలో అయ్యారన్న విషయం నాకు తెలియదు. నీకు దీని గురించి కావాలంటే గూగుల్ లో వెతికితే దొరుకుతుంది" అంది.

"నీ నోటివెంట ఇలాంటి కొత్త విషయాలు వింటే మేం ఎంత అయోమయంగా జీవితాలు వెళ్ళబుచ్చామో అనిపిస్తుంది. నేను జీవితంలో ఏం సాధించాను?"

"అదేంటి అమ్మమ్మా నువ్వు సాధించినది బోలెడు ఉంది. పోనీ ఇప్పుడు నువ్వు నీ బకెట్ లిస్ట్ రాయి" అంది కిరణ్.

" ఇప్పుడు రాయడానికేముందే" అంది.

"ఎందుకు లేదు. ఇప్పటిదాకా నువ్వు సాధించినవన్నీ కూర్చుని రాయి. ఆ తరువాత నువ్వు చెయ్యాలనుకుని చెయ్యలేకపోయిన వాటి లిస్ట్ కూడా రాయి. బకెట్ లిస్ట్ కి ఈ టైం లోనే రాయాలని లేదు. బకెట్ లిస్ట్ అన్నది మనం చనిపోయే లోపల చెయ్యదల్చుకున్న పనులు, చేసిన పనులు. మేం చిన్నపిల్లలం చూడాల్సిన ప్రదేశాలు, మేం జీవితంలో ఏం అవ్వాలని అనుకుంటున్నాము అన్నవి రాసుకుంటే జీవితం లో మోటివేషన్ దొరుకుతుంది నీకున్న కలలేమిటి దాన్ని ఎలా సాకారం చేసుకోవలనుకుంటున్నావు? ఇవన్నీ బకెట్ లిస్ట్ లో వస్తాయి. కాబట్టి ఇప్పటిదాకా నువ్వేం సాధించావో రాసుకో దానితో నీకు నీ జీవితం వేస్ట్ అయ్యిందన్న భావం కలగదు. ఆ తరువాత నువ్వు చెయ్యాలనుకుని చెయ్యలేని పనులు రాయి. వాటికి ఇప్పటికీ టైం ఉందని నా ఉద్దేశం. ఎందుకంటే నీలో ఆ స్పోర్టివ్ స్పిరిట్ వుంది. కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ నువ్వు నేర్చుకున్నావు. తాత నీకన్నా ఎక్కువ చదువుకున్నా నేర్చుకోనని చెప్పేసారు. ఆయనకు కొత్తవి నేర్చుకోవాలని ఉండదు" అంది..

" అలాగే నా బంగారు తల్లీ అందుకే నువ్వంటే నాకిష్టం. అన్నీ అమ్మమ్మ కు తెలిసేటట్లుగా నేర్పుతావు" అంది సునంద.

"నువ్వు నాకు ఎన్ని నేర్పలేదు? నీ మూలంగానే నేను ఇంత పెద్దదాన్ని అయ్యాను. మా అమ్మమ్మ బంగారం" అంటూ ముద్దు పెట్టుకుంది.

అప్పుడే వంటింట్లోకి అడుగుబెట్టిన రాధ "ఏమిటీ అమ్మమ్మా మనవరాలు మంతనాలు ఆడుకుంటున్నారు?" అంది.

"నీకెందుకు అది మా సీక్రెట్" అంది కిరణ్.

" అమ్మా ఏమిటి నువ్వు కూడా చిన్నపిల్లలా దానితో బాటు కబుర్లు" అంది.ఎక్కడో తన కూతురు తనకన్నా అమ్మమ్మ తో అన్నీ పంచుకుంటుందన్న భావన.

మళ్ళీ తన లో తను అనుకుంది అమ్మకు అన్ని వయసుల వాళ్ళతో కలిసే పోయే తత్వం ఉంది. చిన్నప్పుడు తను కూడా అమ్మతో పంచుకునేది ఇప్పుడు పెద్దయ్యాక తమ మధ్య దూరం పెరిగింది. దానికి కారణం తనే అని తెలుసు. అమ్మ నిండుకుండ తొణకదు. తనలాగా అన్నిటికీ చిందులు వెయ్యదు. అమ్మ ఓర్పు తనకెందుకు రాలేదు? బహుశా తను నాన్నను పోలి ఉంటుంది అనుకుంది.

ఆ రోజు నించీ సునంద ఆలోచనల నిండా బకెట్ లిస్ట్ గురించే. ఒక రోజు రాయడానికి నిశ్చయించుకుని చిన్న పాడ్ పెన్ తీసుకుంది.

ఒక్కసారి మనసులో  ఇప్పటిదాకా తనేం చేసిందని.ఏం తట్టలేదు. పెన్ పాడ్ పక్కన పెట్టేసింది.రాధ చెప్పినట్లు పిల్లలతో సమంగా చెయ్యాలనుకోవడం బుద్ధి తక్కువ ఈ వయసులో కృష్ణా రామా అనుకోకుండా ఇవన్నీ ఎందుకు?

మనసుని సమాధాన పర్చుకుందుకు చూస్తోంది. ఎంత చేసినా మనసు చెప్పిన మాట వినటం లేదు. ఉదాసీనంగా ఉన్న భార్యను చూసి ఏమయ్యిందని అడిగాడు రమణ.

ఏమని చెప్పాలి. తన ఆలోచనల్ని అతను అర్థం చేసుకుంటారా? ఏమో? ఎందుకో చెప్పాలనిపించ లేదు. ఎప్పుడూ పిల్లల విషయాలు, సంసారం గురించిన సమస్యలు తప్ప వాళ్ళిద్దరి మధ్య వేరే సంభాషణలు చోటు చేసుకోలేదు. సునంద తన మనసు విప్పి ఎప్పుడూ చెప్పడానికి ప్రయత్నం చెయ్యలేదు.

భార్య భర్తల మధ్య ఉండాల్సిన స్నేహ భావం వాళ్ళిద్దరి మధ్య లేదనే చెప్పుకోవాలి. భర్త లో ప్రియ సఖుడ్ని చూసుకో గలిగిన ఆడది అదృష్టవంతురాలు.

రెండు రోజుల తరువాత కిరణ్ అమ్మమ్మ ని అడిగింది "నీ బకెట్ లిస్ట్ రాసావా?" అని.

లేదని సమాధానం ఇచ్చింది సునంద.

"అదేంటి అమ్మమ్మా ఎందుకు రాయలేదు?" అంది.

"రాయడానికి ఏముంది" అంది.

"ఇప్పటి దాకా నీ జీవితంలో సాధించినవి రాయి"

"ఏం సాధించాను? "

"అమ్మా మీ అమ్మ జీవితంలో ఏం సాధించలేదా?" అంది అక్కడె కూర్చుని లాప్ టాప్ లో పనిచేస్తున్న తల్లితో.

"ఎందుకు చెయ్యలేదు? ఐనా ఇప్పుడవన్నీ ఎందుకు?" అంది.

"బకెట్ లిస్ట్ గురించి తెలుసు కదా నీకు?" అంది  కిరణ్.

"ఆ తెలుసు ఇప్పుడు దాని అవసరం ఎందుకు వచ్చింది?"

"నా టెబుల్ మీద నేను రాసిన లిస్ట్ చూసి అమ్మమ్మ అడిగింది చెప్పాను. నేను కూడా రాయవచ్చా! అంది రాయవచ్చు అన్నాను. ఇప్పుడు రాయడానికి ఏం లేదు అంటోంది. అలా ఎలా ఉంటుంది?" అంది కిరణ్.

" ఇప్పుడీ వయసులొ అదెందుకు? నేనే ఎప్పుడూ రాయలేదు" అంది రాధ.

"అదేంటమ్మా నువ్వు రాయక పోతే అమ్మమ్మ రాయకూడదని లేదు కదా!" అంది కిరణ్.

"నాకు తెలియదు మీరిద్దరూ చూసుకోండి మీ ఇద్దరి మధ్య నేనెందుకు" అంటూ లాప్ టాప్ తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

" పోనీ నువ్వు చేద్దామనుకుని చెయ్యలేని పనులు ముందు రాయి. నువ్వు ఏం చేసావన్నవి తరువాత ఆలోచించి రాయి" అంది కిరణ్.

"అస్సలు ఈ పేరే విచిత్రం గా ఉంది"

"కిక్ ద బకెట్ అని విన్నావా?" అంది కిరణ్

"విన్నాను. అంటే ఈ లిస్ట్ మనం చనిపోయే లోపల చెయ్యాలనుకున్న పనులు కదా!"

"కరెక్ట్ అలాగే మనం ఇప్పటి దాకా ఏమైనా సాధించామా అన్నది ఆలోచించుకుని అవి కూడా రాయవచ్చు. దానితో మనకు మన మీద ఆత్మ విశ్వాసం కలుగుతుంది. మనం అనుకున్నది చెయ్యగలమన్న ధీమా వస్తుంది" అంది కిరణ్

పెన్ను పాడ్ ఇచ్చి" రాయి నువ్వు చెయ్యాలనుకుని చెయ్యలేని పనులు" అంది.

పెన్ పాడ్ తీసుకుని " కార్ డ్రైవింగ్ నేర్చుకోవాలని ఉండేది నాకు కానీ మీ తాత నేర్చుకోవద్దన్నారు. కానీ ఇప్పుడు కుదరదేమో కదా!" అంది.

"అది నీకు ఆనందాన్ని ఇస్తుందంటే నేర్చుకో రోడ్ మీద నడపక పోయినా నీకు అది వచ్చు అన్న భావన చాలు నేను నేర్పుతాను.ఇంకా" అంది.

"బోన సాయ్ అంటే నాకు చాలా ఇష్టం" అంది.

"అది పెద్ద కష్టం కాదు నేను అది నేర్పే వాళ్ళ దగ్గరకు తీసుకు వెడతాను" అంది.

ఆ మాట తో ఒక్కసారిగా సునంద మనసులో తను చెయ్యాలని అనుకున్న పనుల వెల్లువ వరసగా రాయడం మొదలయ్యింది.

"చాలా ఎక్కువ రాస్తున్నానేమో?" అంది.

రాయి అమ్మమ్మా రాసినంత మాత్రం నష్టం లేదు కదా! చెయ్యగల్గినన్ని చెయ్యి. ఇప్పుడు కూడా నీ మనసులోనివి అణిచిపెట్టాల్సిన అవసరం లేదు" అంది కిరణ్.

కిరణ్ మొహంలోకి ఆనందంగా చూస్తూ, 'నేను లాల పోసి పెంచిన నా బంగారు అప్పుడె ఎంత పెద్దదయి పోయిందో' అనుకుంటుంటే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"అమ్మమ్మా ఏడుస్తున్నావా?" అంది

"లేదురా ఇవి ఆనంద భాష్పాలు. నేను ఎత్తుకుని పెంచిన నా చిన్న పండు ఇప్పుడు పెద్ద అయిపోయి నాకు పాఠాలు చెపుతోందన్న ఆనందం"

"మై స్వీట్ అమ్మమ్మ" అంటూ ముద్దు పెట్టుకుని " ఇంక నేను చదువుకోవాలి. రేపట్నించీ డ్రైవింగ్ స్టార్ట్" అంది.

"ఎస్ మేడం" అంది సునంద.

లోపలికి తన గదిలోకి వెళ్ళిపోయాక సునంద ఆలోచల్లోకి వెళ్ళిపోయింది. ఎప్పుడూ గతాన్ని తల్చుకునే అవసరం లేనంత బిజీగా గడిచిపోయింది. ఎదురుగుండా కనబడుతున్న తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడానికి పడ్డ తాపత్రయంలో కాలం ఎలా పరుగెట్టిందో తెలియలేదు. ఇప్పుడు ఆలోచించాలి. ఇన్నాళ్ళూ తను ఏం సాధించింది? పిల్లల్ని సక్రమంగా పెంచి దేశానికి మంచి పౌరుల్ని ఇవ్వడం ప్రతీ తల్లి యొక్క కర్తవ్యం.

సరి ఐన దారిలో నడవక పోతే పిల్లలు దేశానికి సమాజానికి చీడపురుగుల్లా తయారయ్యే ప్రమాదం ఉంది.

చుట్టు పక్కల కమ్ముకున్న కుళ్ళు నించి ప్రతీ క్షణం పిల్లల్ని కాపాడ్డం సరిపోయింది. అందుకే వాళ్ళు ఇప్పుడు తల్లిగా గర్వ పడే పిల్లలుగా మారారు. తమ వృత్తుల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ఇది తను సాధించిన విజయమే కదా!

పెళ్ళితో ఆగిపోయిన చదువు తిరిగి మొదలు పెట్టి బాధ్యతలు నిర్వర్తిస్తూనే పోస్ట్ గ్రాడ్యుఏషన్ పూర్తి చేసింది. పిల్లల భవిష్యత్తు కి డబ్బు అవసరమని తను కూడా ఉద్యోగం చేసి భర్త కు ఆర్ధికంగా తోడ్పడింది. ఇవన్నీ తను సాధించిన విజయాలే కదా!

కిరణ్ చెప్పినది నిజమే "ఒక్కసారి తీరికగా కూర్చుని ఆలోచించు అమ్మమ్మా నువ్వు ఎన్నో విజయాలు సాధించి ఉంటావు. అవి నీ విజయాలని నీకు తెలియక పోవచ్చు అవి జ్ఞాపకం తెచ్చుకుని రాసుకుంటే నీకు ఆత్మ సంతృప్తి కలిగి నీలో కొత్త ఉత్సాహం కలుగుతుంది. అలాగే నువ్వు ఇంకా ఏం చెయ్యాలనుకుంటున్నావో అవన్నీ రాసుకుని పూర్తి చెయ్యడానికి ప్రయత్నించు." అంది.

సునంద రాయడం మొదలు పెట్టింది.

మర్నాడు కార్ డ్రైవింగ్ కి బయలు దేరింది. పెట్టెలో ఎక్కడో దాచిన సల్వార్ కమీజ్ తీసి వేసుకుంది. ఆ బట్టల్లో ఆమెను చూసి ఆశ్చర్య పొయారు ఆమె భర్త, కూతురు.

విషయం తెలుసుకున్న రమణ "ఈ వయసులో ఇది ఇప్పుడు అవసరమా?" అన్నాడు.

"అవసరం అని కాదు తాతా తన మనసులో ఉన్న కోరికలు, చెయ్యాలనుకున్న పనులూ చెయ్యాలనుకోవడం తప్పు లేదు. బాధ్యతల మధ్య తనను తాను బంధించుకుని, తనకేం కావాలో ఇన్నాళ్ళు ఆలోచించ లేదు అమ్మమ్మ. ఇప్పుడైనా ఆమెను స్వేఛ్చగా ఆమె అనుకున్నట్లు జీవించనివ్వండి" అంది.

అడ్డు చెప్పబోయిన రాధ కు కూతురు మాటలు విన్నాక ఆమె చెప్పినది నిజమనిపించింది. తను పెరిగినంత స్వేఛ్చగా అమ్మ పెరగలేదు. ఇప్పుడైనా ఆమెకు అవకాశం ఇవ్వాలి.

తల్లి దగ్గరకు వచ్చి ప్రేమగా కౌగలించుకుని "నీ లిస్ట్ తొందరలో సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంది.

శ్రద్ధ పెట్టడంతో తొందరగానే వచ్చింది డ్రైవింగ్ సునందకు

"నీకు ఈ వయసులో లైసెన్స్ దొరుకుతుందేమో కనుక్కుంటాను చాలా బాగ డ్రైవ్ చేస్తున్నావు" అంది కిరణ్.

"వద్దమ్మా అందరినీ చూసి కార్ స్టీరింగ్ తిప్పాలన్న కోరిక పెంచుకున్నాను తప్ప మరేం కాదు. మీతాత నడుపుతున్నప్పుడు ఆ కార్ స్టీరింగ్ నా చేతుల్లో ఎన్ని సార్లు ఊహించుకున్నానో. ఒకసారి డ్రైవర్ ని అడిగాను నేర్పుతావా అని. కానీ ఎందుకో ధైర్యం చెయ్యలేక పోయాను. నాకిప్పుడు కార్ డ్రైవింగ్ కూడా వచ్చన్న సంతృప్తి చాలు అంతకన్నా అవసరం లేదు." అంది.

ఇది జరిగిన వారానికి రాధ తల్లి తండ్రి ఉన్న గదిలోకి వచ్చింది. కూతురు రావడం చూసి చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తింది సునంద.

"ఏమైనా మాట్లాడాలా?" అంది."

అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుంటూ " అమ్మా ఇదిగో" అంటూ టికెట్ చేతిలో పెట్టింది.

"ఏమిటమ్మా! ఇది" అంటూ ఓపెన్ చేసి చూసి "ఇప్పుడిదెందుకు" అని అడిగింది.

"నీ లిస్ట్ లో ఇది కూడా ఉందిగా" అంది.

"ఏమిటి అది? లిస్ట్ ఏమిటి" అన్నాడు రమణ.

"నాన్నా మీ ఇద్దరికీ యూరప్ ట్రిప్ కి టిక్కెట్స్. అమ్మ బకెట్ లిస్ట్ లో ఇది కూడా ఒకటి" అంది రాధ.

"ఇప్పుడు ఈ వయసులో ఇవన్నీ అవసరమా?" అన్నాడు కొంచెం వెటకారంగా.

ఎప్పుడూ రాని కోపం వచ్చింది ఆ మాటతో సునంద కు.

"అన్ని కోరికలకూ వయసు రాసి పెట్టారా? నా మనసులో ఏ కోరికలు ఉన్నాయో ఎప్పుడైనా అడిగారా? మీ కోరికలు తీర్చుకున్నారు. పిల్లల కోరికలు తీర్చారు. నాకూ కోరికలు ఉంటాయని మీకెప్పుడూ అనిపించ లేదా?"

ఆ మాట తోఖంగు తిన్నాడు అతను.

"అదేమిటి నాన్నా అలా అంటారు. మీరు ఉద్యోగ రీత్యా తిరిగారు. మేం కూడా మా వీలుని బట్టి రకరకాల టూర్లు వెళ్ళాము. కానీ ఎప్పుడూ అమ్మకు కూడా వెళ్ళాలని ఉంటుందని అనుకో లేదు. అసలెందుకు మనకు ఆ ఊహ రాలేదు. ఇప్పుడు కూడా కిరణ్ మూలంగా అమ్మ కోరికలు బైటికి వచ్చాయి. హాయిగా అమ్మను తీసుకుని మీ ఇద్దరూ తిరిగి రండి. ఆమెను కష్ట పెట్టవద్దు" అంది రాధ.

అవును నిజమే ఎప్పుడూ భార్య గురించి ఆలోచించలేదు. చాలా మంది చేసే తప్పు తను కూడా చేసాడు.

"ఇంకా నీ లిస్ట్ లో ఏమున్నాయి? నాకు చూపించు" అన్నాడు నవ్వుతూ.

"ఏం అక్కరలేదు" అంటూ అక్కడినించి వెళ్ళిపోయింది.

యూరప్ ట్రిప్ వెళ్ళి ఆనందంగా గడిపి వచ్చారు. రమణ ఎంతో శ్రద్ధగా సునంద కు అన్నీ చెపుతూ తమలాగే వచ్చిన దంపతుల తో బాగా ఆనందించారు.

"ఇంకా నీ లిస్ట్ లో ఏమైనా ఉంటే చెప్పు" అన్న రమణ తో నవ్వుతూ "చాలు అత్యాశ మంచిది కాదు" అంది.

తిరిగి తమ పల్లెటూరు వెళ్ళిపోయారు రమణ, సునంద. సునంద తన లిస్ట్ లో రాసుకున్న వాటిని పూర్తి చేసిందా? మనవరాలు చెప్పినట్లుగా లిస్ట్ లో అయిపోయిన వాటిని టిక్ పెట్టడం మొదలు పెట్టింది. వెల్లువలా వస్తున్న లిస్ట్ కి ఫుల్ స్టాప్ కూడా పెట్టింది.

అందమైన బోనసాయి మొక్కల పెంపకం లో బిజీగా తన కాలాన్ని గడుపుతోంది. ఈ బకెట్ లిస్ట్ సునంద లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

COMMENTS